

# నవభూమి


## కరీంనగర్

అనుబంధం

30 మే,2025 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# అప్రమత్తంగా ఉంటే చాలు



**సిరిసిల్ల -నవభూమి:** కరోనా మరోసారి కలవరపెడుతోంది. పొరుగు రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు హైరానా పడుతున్నారు. దేశంలో కొవిడ్, ఆ తరువాత ఒమైక్రాన్, ఇలా ఏ వేరియంట్ వచ్చినా జిల్లాలో కేసులు నమోదు అవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం వస్త్రోత్పత్తి రంగంలో ఉండగా, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం దక్షిణ కాశీగా విరాజిల్లుతోంది. ఈక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి జిల్లాకు రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. మరోవైపు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్న కార్మికులతో పాటు ఇతర దేశాల్లోనూ ఉద్యోగం, చదువు రీత్యా వెళ్లిన వారు ఎక్కువగానే ఉన్నారు. రాకపోకలతో వైరస్ వ్యాప్తి జిల్లాలో ముందుగానే వెలుగుచూస్తోంది. గతంలో కొవిడ్ తరువాత వచ్చి ఒమైక్రాన్ కూడా రాష్ట్రంలో సిరిసిల్లలోనే తొలి కేసులు గుర్తించారు. ఈక్రమంలో ప్రపంచాన్ని స్తంభింపజేసిన కరోనా మహమ్మారి మరోసారి బయటపడడంతో జిల్లా ప్రజల్లో అప్రమత్తత మొదలైంది. వైద్యులు, ఐసీఎంఆర్ మాత్రం ప్రస్తుతం వస్తున్న వేరియంట్‌తో పెద్దగా ముప్పులేదని సాధారణ అప్రమత్తతే సరిపోతుందని సూచిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కొవిడ్‌తో పాటు వర్షాకాలం సీజనల్ వ్యాధులను ఎదుర్కొనే దిశగా అలర్ట్ ప్రకటించింది. తీసుకోవాల్సిన సూచనలపై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు కూడా జారీ చేశారు.వదంతులు వ్యాప్తి చెందకుండా చర్యలు...కొవిడ్‌పై వస్తున్న వదంతులు వ్యాప్తిచెందకుండా ప్రభుత్వం చర్యలు కూడా చేపట్టింది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు కరోనాపై మాట్లాడాలని, అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయవద్దని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని ప్రభుత్వం సూచనలు చేసినట్లుగా తెలిసింది. సాధారణంగా వచ్చే జలుబు, దగ్గుకు ప్రజలు భయాందోళనలకు గురికావద్దని సూచనలు చేస్తున్నారు. మరోవైపు ఆక్సిజన్ నిల్వలు, బెడ్స్, అవసరమైన మందులు, మాస్కులు, ఆర్టీపీసీఆర్ పరీక్షల కిట్‌లు, ఇతర సామగ్రి అవసరాలపై ప్రభుత్వం నివేదిక కోరినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం వస్తున్న కొత్త వేరియంట్‌తో ఇబ్బందులు లేకపోయినా గుండె, క్యాన్సర్, కాలేయం, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు, కిడ్నీ బాధితులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.గతంలో జిల్లాలో 37,197 మంది బాధితులు...కరోనా మహమ్మారి మొదటి రెండు దశల్లో చేసిన బీభత్సం ప్రజల నుంచి ఇప్పటికి తొలగిపోవడం లేదు. ఎంతో మంది ఆర్థికంగా చితికిపోగా, అనేక కుటుంబాల్లో మృత్యుఘోష వినిపించింది. మూడో దశలో ఎలాంటి ఇబ్బంది లేకుండానే గడిచిపోయింది. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. గతంలో రెండు దశల్లో జిల్లాలో 37,197 మంది కొవిడ్ బారిన పడ్డారు. 676 మంది మృతిచెందారు. జిల్లాలో కొవిడ్ రెండు దశలతో పాటు ఒమైక్రాన్ సీజన్ వరకు 7,19,092 మందికి కొవిడ్ పరీక్షలు చేయగా, 37,197 మంది కొవిడ్ బారిన పడ్డారు. వీరిలో 36,509 మంది కోలుకున్నారు. 676 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో మొదటి వేవ్‌లో 13,380 మంది కొవిడ్ బారిన పడగా, 165 మంది మృతిచెందారు. సెకండ్ వేవ్‌లో 19,085 మంది కొవిడ్ బారిన పడగా, 508 మంది మృతిచెందారు. థర్డ్ వేవ్‌లో 4,732 కొవిడ్ బారిన పడ్డారు. 2020 సంవత్సరంలో ఏప్రిల్‌లో 2.91 శాతం, మేలో 27.91 శాతం, జూన్‌లో 2.61 శాతం, జూలైలో 15.33 శాతం, ఆగస్టులో 27.10 శాతం, సెప్టెంబరులో 28.48 శాతం, అక్టోబరులో 7.88 శాతం, నవంబరులో 4.13 శాతం, డిసెంబరులో 1.63 శాతం నమోదైంది. 2021 సంవత్సరంలో జనవరిలో 1.35 శాతం, ఫిబ్రవరలో 0.96 శాతం, మార్చిలో 1.90 శాతం, ఏప్రిల్‌లో 20.04 శాతం, మేలో 30.9 శాతం, జూన్‌లో 1.91 శాతం, జూలైలో 1.22 శాతం, ఆగస్టులో 0.73 శాతం, సెప్టెంబరులో 0.32 శాతం అక్టోబరులో 0.60 శాతం, నవంబరులో 0.10 శాతం డిసెంబరులో పూర్తిగా కేసులు తగ్గుముఖం పట్టి 0.05 శాతానికి చేరుకుంది. 2022 జనవరిలో ?థర్డ్‌వేవ్ వచ్చింది. జనవరిలో 9.96 శాతం కేసులు నమోదు కాగా ఫిబ్రవరిలో 3.69, మార్చి 0.05 శాతం, ఏప్రిల్, మేలో నిల్, జూన్‌లో 0.05 శాతం, జూలైలో 12.20 శాతం. ఆగస్టులో 1.02 శాతం, సెప్టెంబరులో 0.72, అక్టోబరు, నవంబరు, డిసెంబరు 2023 జనవరి, ఫిబ్రవరిలో పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. మార్చి 10.71 శాతం పాజిటివ్ రేటు చేరుకుంది. ఏప్రిల్‌లో తగ్గుముఖం పట్టింది. ఈసారి కూడా భయపడాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు.జిల్లాలో ప్రస్తుతం కొవిడ్ వైరస్ లక్షణాలు లేవు. జిల్లా ఆసుపత్రిలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ఏ వైరస్ అయినా చేతుల ద్వారానే శరీరంలోకి ప్రవేశిస్తున్నందున ప్రజలు కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. శుభ్రంగా లేని చేతులతో కళ్లు, ముక్కు తాకడం వంటివి చేయవద్దు. మాస్క్ ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రత, రద్దీ ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఏవైరస్ వచ్చినా నియంత్రణలో పెట్టవచ్చు. ప్రజలు ఆందోళన చెందకుండా ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందవచ్చు.

### సీఎం ఫొటోలు ఉండాలని

# జీవో జారీ చేయండి




**సిరిసిల్ల -నవభూమి:** రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటోలు ఉండాలని జీవోను తీసి అమలుచేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సవాలు విసిరారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులు చట్టాల ను, ప్రొటోకాల్స్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కేటీఆర్, ఆది శ్రీనివాస్ గెలిచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లు ఎక్కువగా గెలిచినందున కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆది శ్రీని వాస్ విప్‌గా నియమించిందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో విప్ గా ఆది శ్రీనివాస్ ఎన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాడు ఆ కార్యక్రమాల కు ఎన్నిసార్లు సిరిసిల్ల శాసన సభ్యుడు కేటీఆర్‌ను ఆహ్వానించారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ పాటించకుండా కేటీఆర్ ఫొటో లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించారని ఆరోపిం చారు. కేసీఆర్ ప్రభుత్వంలో కేటీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభి వృద్ధి పనులను మీరు చేసినట్లు కేటీఆర్ ఫొటోలు లేకుండా ప్రొటో కాల్ పాటించకుండా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఎం ఐఎం ఎమ్మెలేల క్యాంప్ ఆఫీసుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో లు పెట్టుకున్నారా అని ప్రశ్నించారు. ఎంపీగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ క్యాంప్ కార్యాలయాల్లో ప్రధాన మంత్రి ఫొటోలు పెట్టుకున్నారా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు గుండారపు కృష్ణారెడ్డి, గెంట్యాల శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, రాజిరెడ్డి, ఉమారెడ్డి పాల్గొన్నారు.

# కేసుల పరిశోధనలో పారదర్శకంగా వుండాలి

## రామగుండం పోలీస్ కమిషనర్



**ఫర్టిలైజర్ -నవభూమి:** శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులకు సూచించారు. నెలవారి సమీక్షలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో ఆయన గురువారం కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్ల వారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మొదలైన అంశాలపై పోలీస్ స్టేషన్ వారిగా సమీక్షా జరిపారు.నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. అనంతరం సిపి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్ లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు, నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను కోర్టుకు అందజేయాలని,అలాగే మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో అధికారులు వేగంగా స్పందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహిరంచాలని, దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, ప్రధానంగా చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో అధికారులు సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ దర్యాప్తు కొనసాగించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో కలసి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. తరుచుగా నేరాలకు పాల్పడే నేరస్థులపై సస్పెక్ట్, రౌడీ షీట్ల తెరవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాల్సి వుంటుందని, పోలీస్ అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారితో స్నేహపూర్వకంగా వుండాలని, భాధ్యయుతంగా విధులు నిర్వహిస్తూ బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐ లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి



**బోయినపల్లి, -నవభూమి:** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు 30 రోజులలోగా తప్పనిసరిగా ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్దిదారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బోయిన్‌పల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌లో రెండో విడత కింద 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ బోయిన్‌పల్లి మండలం అనంతపల్లి గ్రామంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసుకొని మొదటి విడత కింద 109 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, 50 శాతంవరకు పూర్తయ్యాయని, ప్రభుత్వం వారికి చెల్లింపులు కూడా చేస్తుందన్నారు. రెండో విడత కింద మండల వ్యాప్తంగా 709 లబ్దిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని, వీరు ఇంటి నిర్మాణం పనులు 30రోజులలోగా తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. 3 నెలల వ్యవధిలో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తిచేసుకొని రానున్న పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాల ని సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థికసహాయం అందుతుందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బోయిన్‌పల్లి మండలంలో 709 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల హృదయాల్లో స్పష్టమైన ముద్ర వేసుకునేలా సిరిసిల్ల కలెక్టర్ పనితీరు ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు. మానవీయ కోణంతో పని చేస్తున్న కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మిడ్ మానేరు బాధితులకు న్యాయం చేయ డం కోసం త్వరలో అదనంగా 1000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. మం డలంలో 4153 రైతులకు రూ36 కోట్ల 63 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, గతంలో కేవలం 13కోట్ల మాత్రమే జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందు లు పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పిఏసి చైర్ పర్సన్ వెంకట రామారావు, సెజ్ సంచాలకులు సుధాకర్, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయశీల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సురేందర్ రెడ్డి రమణారెడ్డి సుధాకర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2న లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేయాలి

**సిరిసిల్ల -నవభూమి:** రాజీవ్ యువ వికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటుచేసి జూన్ 2న లబ్దిదారులకు ఎంపిక పత్రాలను అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజీవ్ యువ వికా సం అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా పథకాలు అమలు చేశాయని, తమ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలని చిత్తశుద్ధితో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తోందన్నారు. యువ వికాసం పథ కం కింద వచ్చే సహాయంతో యువత వ్యాపారంచేసి లబ్ది పొందాలని, రూ 8 వేల కోట్ల రూపాయలతో దాదాపు 5 లక్షల మంది యువతను వ్యాపారవేత్తలుగా మారుస్తున్నామని, ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, రాష్ట్ర జిడీపీ వృద్ధిలో ఈ పథకం భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్ చేసిన తర్వాత వాటి పనితీరు పర్యవేక్షించేందుకు జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇన్‌చార్జి మంత్రుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసంపై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అందులో యువ వికాసం లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ పంపి ణీ చేయాలన్నారు. బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్దిదారుల ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు.

# బల్దియాలో డీజిల్ గోల్‌మాల్

**జగిత్యాల, -నవభూమి:** జగిత్యాల మున్సిపల్ వాహనాల్లో డీజిల్ వినియోగంలో గోల్‌మాల్ జరిగింది. గతంలో ఆస్తి పన్ను వసూళ్లు, శానిటేషన్‌లో లక్ష్యాలను అధిగమించి ప్రశంసలు అందుకున్న జగిత్యాల మున్సిపాలిటీలో ప్రస్తుతం అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగిత్యాల మున్సిపాలిటీలో ప్రతివారం శానిటేషన్ కోసం వాహనాలకు డీజిల్ పోయిస్తున్నారు. బల్దియాలో మొత్తం 72 శానిటేషన్‌కు వినియోగించే వాహనాలు ఉన్నాయి. వీటికి వారానికి సుమారు 2 వేల లీటర్ల డీజిల్ వినియోగం అవుతుందని అంచనా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి వరకు రూ.10 లక్షల డీజిల్ వినియోగం కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి నెల వరకు రూ.16.27 లక్షలకు పెరగడం అనుమానాలకు తావిస్తోంది. ఏడాది కాలంలో డీజిల్ వినియోగం రూ.6 లక్షలకు పైగా పెరగడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ విషయమై కొందరు కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించి పది రోజులు గడిచినా నేటికీ విచారణ నివేదిక బయటకు రాకపోవడం గమనార్హం. డీజిల్ వ్యవహారంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మెమో జారీ చేశారు. కూపన్ విధానానికి ఎసరు..గతంలో వాహనాల్లో డీజిల్ పోయించేందుకు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అప్పటి పాలకులు కూపన్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. పారిశుధ్య వాహనంలో వారానికి ఒకసారి సుమారు 30 లీటర్ల డీజిల్ పోయిస్తుండేవారు. కమిషనర్ కూపన్ రాసి ఇస్తే, వాహనదారులు ఆ రశీదులను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఇవ్వాల్సి ఉండేది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో వాహనాల్లో డీజిల్ పోయించే విధానం ఉండేది. ఈ పద్ధతి ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డీజిల్ ఖర్చు వచ్చేది. కానీ కూపన్ వ్యవస్థకు ఎసరు పెట్టడంతో గత ఏడాదిగా రూ.16 లక్షల పైచిలుకు బిల్లులు రావడం అనుమానాలకు తావిస్తోంది. కాగా మున్సిపల్ కార్యాలయంలోని వేరే విభాగంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్‌కు డీజిల్ బిల్లులు అప్పగించారు. మాన్యువల్ బిల్లులు సమర్పణ మున్సిపల్ వాహనాలకు సంబంధించి డీజిల్ పోయించేపుడు సదరు పెట్రోల్ బంకు నిర్వాహకులు కంప్యూటర్ బిల్లులు ఇస్తుంటారు. సదరు బిల్లుల్లో వాహన నంబర్, ఎన్ని లీటర్ల డీజిల్, ఎంత ధర, ఏ సమయానికి పోయించారనే పూర్తి



వివరాలు రశీదులో నిక్షిప్తమై ఉంటాయి. ఆ బిల్లులనే రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. కానీ కంప్యూటర్ బిల్లులు రావడం లేదనే నెపంతో మాన్యువల్ బిల్లులు తీసుకొని రికార్డులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాన్యువల్ బిల్లుల్లో వాహన నెంబర్లు లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించిన నివేదిక బహిర్గతం చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి జగిత్యాల మున్సిపాలిటీపై పర్యవేక్షణ లోపంతో అవినీతి పెరిగిపోయిందన్న విమర్శలున్నాయి. ఈ మధ్య కాలంలో ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరుగుతున్నా ఉన్నతాధికారులు కనీసం కార్యాలయాన్ని సందర్శించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించకపోవడం, ఆకస్మిక తనిఖీలు లేకపోవడంతో కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మున్సిపల్ ఆదాయానికి గండిపడకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.డీజిల్ అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నాం స్పందన, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల మున్సిపాలిటీలో డీజిల్ అక్రమాల ఆరోపణలపై దృష్టి సారించాం. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు కారణమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతికి మెమో జారీ చేశాం. డీజిల్ వినియోగంపై బాధ్యతలను కొత్త అధికారులను అప్పగించాం. డీజిల్ బిల్లును తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నా.

# వానాకాలం సాగు ప్రణాళిక సిద్ధం

**కరీంనగర్ -నవభూమి:** ఇప్పటికే రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతీ రుతుపవనాలతో జిల్లాలో మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. జిల్లాలో ఈ సీజన్‌లో 3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ప్రధాన పంట వరిని 2,76,500 ఎకరాల్లో, పత్తిని 48 వేల ఎకరాల్లో, మొక్కజొన్నను నాలుగు వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. వెయ్యి ఎకరాల్లో కంది, 200 ఎకరాల్లో పెసర, వెయ్యి ఎకరాల్లో మిర్చి, 150 ఎకరాల్లో వేరుశెనగ, 13,045 ఎకరాల్లో కూరగాయలు, ఇతర హార్టికల్చర్ సాగును చేస్తారని అంచనా వేశారు. 300 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తారని భావిస్తున్నారు.ఎరువులు, విత్తనాలకు ఏర్పాట్లు 3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసే రైతన్నలు అధిక ఉత్పత్తి సాధించడానికి ఈ పంటల కోసం 43,254 మెట్రిక్ టన్నుల యూరియా, 26,957 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 7,730 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 6,945 మెట్రిక్ టన్నుల డీఏపీ వినియోగిస్తారని వ్యవసాయశాఖ అంచనా వేశారు. అందుకు అనుగుణంగా స్టాక్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. 69,125 క్వింటాళ్ల వరి విత్తనాలు, 320 క్వింటాళ్ల మొక్కజొన్న, 30 క్వింటాళ్ల కందులు, 16 క్వింటాళ్ల పెసర, 90 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు, 88,162 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయని అంచనావేసింది. ఈ మేరకు వాటిని అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 16,809 మెట్రిక్ టన్నుల యూరియా, 31,076 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,593 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,836 మెట్రిక్ టన్నుల ఎంవోపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్నిబట్టి ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి ఎరువులు తెప్పించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రధానంగా ప్రతి యేటా పత్తి విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరా చేసుకుని వ్యాపారులు ఆ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు



తరలిస్తారు. అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది.బీటీ-3 పత్తి విత్తనాలపై నిషేధం బీటీ-3 పత్తి విత్తనాలను వాడవద్దని, ఈ విత్తనాలను సాగు చేస్తే పర్యావరణం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ చెబుతున్నది. దేశంలో ఈ పత్తిని సాగు చేసేందుకు అనుమతి లేదు. బీటీ-3, బీజీ-3 విత్తనాలను హెర్బిసైడ్ టాలరెంట్ విత్తనాలుగా పేర్కొంటారు. ఈ విత్తనాలు గ్లైఫోసిన్ కలుపు మందును తట్టుకుని ఉండేలా జన్యుమార్పిడి చేసిన రకాలకు చెందినవి. ఈ విత్తనాలను సాగు చేస్తే కలుపు మందు కొట్టినా మొక్క చనిపోదని అందుకోసమే రైతులు దీన్ని సాగుచేసి అవసరానికి మించిన కలుపు మందును కొడతారు. దీంతో పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ చెబుతుంది. ఈ విత్తనాల సాగుతో పత్తి మొక్క, కలుపు మొక్కల మధ్య క్రాసింగ్ జరిగి కలుపు మందును తట్టుకునే జన్యువులు కలుపు మొక్కల్లోకి ప్రవేశించే అవకాశం ఉంటుందని దాంతో అది సూపర్‌వీడ్‌గా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు.మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి బీటీ-3 విత్తనాలు...పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి బీటీ-3 పత్తి విత్తనాలు తీసుకువచ్చి ప్రతి యేటా విక్రయిస్తున్నారు. వెయ్యి రూపాయలకు కిలో విత్తనాలను విక్రయిస్తున్నారు. విత్తనాలను విక్రయించేవారు నేరుగా గ్రామాలకు వచ్చి రైతులను కలిసి విత్తనాలను, కలుపు మందయిన గ్లైపోసెట్‌ను అమ్ముతున్నారు. పురుగుల మందు షాపుల్లో కూడా ప్రభుత్వం నిషేధించిన గ్లైపోసెట్ మందును గుట్టు చప్పుడు కాకుండా విక్రయించడం ప్రతియేటా జరుగుతున్నది. ఈ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటున్నా రైతులు వాటి సాగుపై మొగ్గు చూపడంతో బీటీ-3 పత్తి సాగు యథేచ్ఛగా సాగుతున్నది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పూర్తి సహకారం



**సిరిసిల్ల -నవభూమి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభు త్వం పూర్తిసహకారం అందిస్తుందని కలెక్ట ర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాలు పురోగతి తదితర అంశాలపై ఆయా మండల ప్రత్యేక అధికా రులతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా రా ష్ట్రంలో జిల్లా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో ప్రథమ స్థానంలో నిల వడంలో కృషిచేసిన అధికారులందరికీ కలె క్టర్ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా ఇండ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వివిధ దశల్లో మొత్తం పది ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందని తెలిపారు. దానికి సంబంధించి ఆయాగ్రామాల కార్యదర్శులు, పట్టణాల్లో వార్డుఆఫీసర్లు తమ తహసీల్దా ర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మ హిళా సంఘాలకు ఇటుక బట్టీలు, సెంట్రిం గ్ దుకాణాలు ఏర్పాటుచేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మోడల్ హౌస్‌ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని హౌ సింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిర మ్మ మోడల్‌హౌస్‌లను ఇందిరమ్మ లబ్ధిదా రులకు చూపించాలని పేర్కొన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల జారీ లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలి చినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మంజూరైన 7862 ఇళ్లకు 7808 అలాట్మెంట్ ఆర్డర్లు ల బ్ధిదారులకు అందజేసినట్లు వెల్లడించారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

**పెద్దపల్లి -నవభూమి:** మానవ అక్రమ రవాణా నిర్మూ లించడంలో అందరూ భాగస్వామ్యం కావాలని డీఈవో మాధవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో బుధ వారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన మండలి సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించి మాట్లాడారు. మానవ అక్రమరవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తోంద న్నారు. ఎంతోమంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరిత మైన చర్య అని, పేద, మధ్యతరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా గురవుతున్నారన్నారు. పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్‌లలో వారికి అవగాహన కల్పించాలన్నారు. సైబర్ ట్రాఫికింగ్ వేగంగా విస్తరిస్తోందని, పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలుపాలన్నారు. మాయమాటలు, ఉద్యోగం, సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాల లో అమ్ముతున్నారని, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు అవగాహన కలిగి ఉండి అప్రమత్తం చేయడం ద్వారా నిర్మూలించవచ్చున్నారు. ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ రోజు ఎంతోమంది అమ్మా యిలు, మహిళలు మానవ అక్రమ రవాణా బారిన పడుతున్నారన్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటివరకు 30వేల మందిని కాపాడామని, ఇందులో చిన్నపిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారన్నారు. సైబర్ ట్రాఫి కింగ్ ద్వారా అక్రమరవాణా పెరిగిపోయిందని, ముఖ్యంగా విద్యార్థులు పర్స నల్ ఫోటోలు, వీడియోలు పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్‌కి గురవుతు న్నారన్నారు. ఈ శిక్షణలో చట్టాలు, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 181, 1930, 181ల గురించి వివరించారు. జిసిడిపిఓ కవిత, హెచ్ఎం అరుణ, ప్రజ్వల సిబ్బంది, కేజీడీవీ గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## మానసిక వేదనతోనే

# పంచాయతీ కార్యదర్శి మృతి

**జగిత్యాల,-నవభూమి:** మంచిర్యాల జిల్లా ఇందన్ పల్లి గ్రామపంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఎర్రోజు చంద్రమౌళి పని ఒత్తిడి, మానసిక వేదన, ఆర్థిక ఇబ్బందులతోనే గుండెపోటుతో మృతి చెందాడని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు బలరాం ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న జగిత్యాల పట్టణానికి చెందిన చంద్రమౌళి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు గురువారం నిర్వహించగా పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు, టీఎన్జీవో, టీజీవో, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జగిత్యాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచ్ ల పదవీకాలం ముగిసినప్పటి నుండి పంచాయతీ కార్యదర్శులు రాత్రనకా, పగలనకా కష్టపడుతూ గ్రామాలలో పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుండి బడ్జెట్ రాకపోయినా గ్రామ పంచాయతీలలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వము నుండి ఒత్తిడి వస్తుండడంతో స్వంతంగా డబ్బులు ఖర్చు చేసి బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని, గ్రాంట్ ఉన్నప్పటికీ ఆ బిల్లులు మంజూరు కాక పంచాయతీ కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గుండెపోటుతో మృతి చెందిన చంద్రమౌళికి ప్రభుత్వం నుండి దాదాపు నాలుగు లక్షల రూపాయలు బిల్లులు రావాల్సి ఉందని, ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి, యూనియన్ నాయకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో చాలా రోజుల నుండి మానసిక వేదన అనుభవిస్తున్నాడన్నారు. ఓవైపు పని ఒత్తిడి, మరోవైపు



ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదనతో చంద్రమౌళి మృతి చెందాడని అన్నారు. చంద్రమౌళి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు పూదరి నరేందర్, బాబురావు, శ్రవణ్ కుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, టీఎన్జీవో జగిత్యాల అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రామ్ కిషన్ రావు, నయీమ్, సిద్దిపేట జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మురళి, సంతోష్, నాయకులు శ్రీనివాస్ నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా ఇంటి నిర్మాణం,రాజీవ్ యువ వికాసం

# అమలు చేయాలి

**రాయికల్,-నవభూమి:** నిరుపేదలు, నిరుద్యోగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. రాయికల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో బీఅర్ఎస్ పట్టణ, మండల నాయకులతో కలిసి ఆమె గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు కేవలం ప్రజలను మభ్య పెట్టే విధంగా ఉన్నాయని ఏద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం స్థలం కేవలం అర గుంట కే పరిమితం చేయడంతో ఇందిరమ్మ లబ్ధిదారులకు నిరాశే మిగిలే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నిబంధనలు అతిక్రమిస్తే బిల్లులు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. అరగుంటలో ఇల్లు కడితే బంధువులు వస్తే మెదిలే స్థలం ఉండదని, నిర్మాణం స్థలం పెంచి తధనుగుణంగా రూ. 5 లక్షలు ఇవ్వడంతో పాటు, అర్హులైన వారందరికీ పథకం వర్తింపచెయ్యాలని డిమాండ్ చేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ గృహ నిర్మాణ బిల్లులను అప్పటి బీఆరెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెల్లించిందని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు మూడు రంగులు వేసి కాంగ్రెస్ ప్రభుత్వంమే కట్టించిందన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇత్తేసీ పొత్తు కూడిన చందంగా కాంగ్రెస్ పాలన ఉందని విమర్శించారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో కూడా క్లారిటీ లేదని, ఓ వైపు సిబిల్ స్కోర్ కు సంబంధం లేదంటూనే మరో వైపు సిబిల్ స్కోర్ ఉన్నవారినే అర్హులుగా ఎంపిక చేశారన్నారు. ఇంటర్వ్యూ ల పేరుతో ప్రభుత్వం కాలయాపనా చేస్తూ యువతని ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. పథకం అమలు కూడా దశల వారీగా ఉంటుందనే ప్రచారం నడుస్తున్న తరుణంలో స్పష్టమైన విధి విధానాలు ప్రకటించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రకటించిన రుణ పరిమితికీ తగ్గట్టుగా సబ్సిడీ రుణలు అందించాలని వసంత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల అధ్యక్షులు బర్కం మల్లేష్, కో ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రాణి సాయి కుమార్, ఉదయ శ్రీ,మైనార్టీ మండల అధ్యక్షులు చాంద్ పాషా, మాజీ ఎంపీటీసీలు నాగరాజు, రాజేందర్ గౌడ్,మాజీ కౌన్సిలర్ శ్రీరాముల సత్య నారాయణ, మహేందర్, నాయకులు గంగారం, ప్రశాంత్ రావు, సోహెల్, శ్రీను, గంగాధర్,రామచంద్రం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



**పెద్దపల్లి-నవభూమి:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్య క్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ కోరారు. బుధ వారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం నందన గార్డెన్లో ఉద్యమకారులను ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తమ జీవితాలను త్యాగం చేశామని, రాష్ట్రం వస్తే తమ బతుకులు మారుతాయని ఆశించామని, కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమిస్తే తమను మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఉద్యమకారులమంతా కాంగ్రెస్ వెంట ఉన్నామని, పార్టీ గెలుపునకు కృషి చేశామని తెలిపారు.జూన్ 2న స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని ఉద్యమకారులను ఏకం చేసి ఐక్యతతో ముందుకు సాగుతున్నామని, భవిష్య త్తులో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవం, సంక్షేమానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పనిచేస్తుందన్నారు. పార్టీలో, సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, గోపగాని సారయ్య గౌడ్, నల్ల మనోహర్ రెడ్డి, నూనె రాజేశం, జ్యోతి, చంద్రకళ, సురేందర్ రెడ్డి, భాస్కర్, సదాశివ, రాజిరెడ్డి, రాజు, కృష్ణ, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన విజిలెన్స్ అధికారి



**సారంగాపూర్, -నవభూమి:** సారంగాపూర్ మండలంలోని పెంబట్ల, లక్ష్మీదేవి పల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మండల కోఆర్డినేటర్, జిల్లా విజిలెన్స్ అధికారి దేవేందర్ రెడ్డి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న కందకాల పనులు కొలతలు పరిశీలించారు.ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కూలీలకు రూ.307 పడే విధంగా పనిచేయాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బందికి అగ్రి అలైడ్ వర్క్, వ్యక్తిగత పనుల ప్రోగ్రెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీలత, టీఏ స్వప్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## మెట్పల్లిలో రహదారిపై పోలీసుల ఆధ్వర్యంలో గుంతలు పూడ్చివేత

**మెట్పల్లి -నవభూమి:** పట్టణంలో 63వ జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పోలీసులు పూడ్చివేశారు. ఆర్టీసీ డిపో నుంచి ఆరపేట శివారు వరకు ప్రమాదాల నివారణ లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం తాత్కాలిక మరమ్మతులు చేశారు.గుంతలను పూడ్చడం తో పాటు రహదారిపై పలుచోట్ల మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని వేచి చూడకుండా పోలీసులే తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం పట్ల స్థానికులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నాణ్యత ప్రమాణాలు పెంచి

# వినియోగదారులను నిలుపుకోవాలి

**గోదావరిఖని-నవభూమి:** రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళు ,, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది.కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎన్ బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు.ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు




సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**వేములవాడ-నవభూమి:** నియోజవర్గంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం రెండో విడత క్రింద వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆయా గ్రామాల ప్రజలకు 371,వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి గ్రామంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో ఆయా గ్రామాల ప్రజలకు 333 ఇందిరమ్మ ఇండ్ల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు విప్, కలెక్టర్ తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. నియోజకవర్గం లో మొత్తం 3500 ఇందిరమ్మ ఇండ్లకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. వేములవాడ నియోజకవర్గం లోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని ఉద్దేశంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అదనంగా ఇవ్వాలని కోరానని దీంతో ఆయన వెంటనే స్పందించి 1750 మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారని గుర్తు చేశారు. నిర్ణీత సమయం, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం త్వరితగతిన ఇల్లు నిర్మించుకొని సహాయం పొందాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని వివరించారు.పారదర్శకంగా ప్రభుత్వం నిధుల విడుదల ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయాలని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు.4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వేములవాడ అర్బన్ మండలంలో 371మందికి, రూరల్ మండలంలో 333 మంది లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని,400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని స్పష్టం చేశారు. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు,ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. రవాణా ఛార్జీలు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. 30 రోజుల లోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజ్యం,మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రా, తహసిల్దార్, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తో పాటు తదితరులు ఉన్నారు.



# కొండగట్టు అంజన్న ఆలయానికి ముడుపుల రూపంలో రూ.1.65 లక్షల ఆదాయం సమకూరణ



**జగిత్యాల-నవభూమి:** జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధానంలో ఈనెల 20 నుండి 23 వరకు నిర్వహించిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల నేపథ్యంలో దీక్షాపరులు సమర్పించిన ఇరుముడులను లెక్కించినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆలయానికి రూ. 1,65,641 నగదు రూపంలో సమకూరినట్లు తెలిపారు. వస్తు రూపేణా బియ్యం, ఎండు కుడుకలు, భూరు తీయని కొబ్బరి సమకూరినట్లు తెలిపారు. సమకూరిన వస్తువులకు త్వరలోనే టెండర్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకుడు రాజమౌళి, ఆలయ పర్యవేక్షకులు నీలా చంద్రశేఖర్, హరిహరనాథ్, సునీల్, ఆలయ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, పోలీస్ శాఖ ఏఎస్ఐ రమణారెడ్డి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రేకొండలో అగ్నివీర్ జవాన్‌కు ఘనసన్మానం



**చిగురుమామిడి, -నవభూమి:** మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన పిక్కాల అనిల్ పంజాబ్ బెటాలియన్ లో అగ్నివీర్ జవాన్ గా చేరి ఇండియా పాక్ సరిహద్దుల్లో సైనిక సేవలు అందించారు. రెండు రోజుల క్రితం సొంత ఊరు రేకొండకు రావడంతో గ్రామస్తులు జవాన్ అనిల్ ను గురువారం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. దేశం కోసం సరిహద్దుల్లో చేస్తున్న సేవలను గ్రామస్తులు కొనియాడారు. సన్మానించిన వారిలో దొడ్ల రమణారెడ్డి, కొత్తూరు రమేష్, పీరల్ల బీరయ్య, కానవేణి శ్రీనివాస్, దొడ్ల వెంకటరెడ్డి, బండారి మల్లేష్, విలాసాగరం సహదేవ్, అరిగెల శ్రీధర్, అన్న కొమురయ్య, బండి తిరుపతి తదితరులున్నారు.

# హుజురాబాద్లో దళితుల ముందస్తు అరెస్ట్

**హుజూరాబాద్ -నవభూమి:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజూరాబాద్ దళితబంధు సాధనసమితి సభ్యులను హుజూరాబాద్ పోలీసులు గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సాధనసమితి సభ్యులు మాట్లాడుతూ.. దళితుల అరెస్టులు అక్రమమని అన్నారు. దరఖాస్తు ప్రక్రియల్లో నిమగ్నమై ఉన్నామని తెలిపినా పోలీసులు విడిచిపెట్టలేదని అన్నారు. ప్రభుత్వం అరెస్టుల పేరుతో ఇబ్బందిపెడుతోందని వారు మండిపడ్డారు. అరెస్టైన వారిలో అకినపల్లి ఆకాష్, శనిగరం రవీందర్, శనిగరం రాజు, శనిగరం సమ్మయ్య, శనిగరం బుచ్చయ్య ఉన్నారు.



# లక్ష్మీపూర్‌లో హరితహారం చెట్ల నరికివేత



**సిరిసిల్ల -నవభూమి:** తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపూర్ లో హరితహారం లో రోడ్డుకిరువైపులా నాటిన చెట్లను నరికేశారు. లక్ష్మీపూర్ శివారులోని రోడ్డు ఇరువైపులా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కార్ హయంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇరువైపుల మొక్కలు నాటారు. హరితహారంలో గతంలో ఈ గ్రామాన్ని పోలీసులు దత్తత తీసుకున్నారు. అప్పటి సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 2016 లో గ్రామస్తుల సహకారంతో రోడ్డుకిరువైపులా మొక్కలను నాటి పెంచారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఇరువైపుల మొక్కలను నీళ్లు పోసి చక్కగా పెంచారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఐకెపి సీఏ గా పనిచేస్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి గురువారం తన పొలానికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని, రోడ్డుకు ఏ పుగా పెరిగిన హరితహారంలో నాటిన చెట్లను నరికేశారు. ఈ విషయంపై కార్యదర్శి సంతోష్ వివరణ కోరగా నరికిన చెట్లను పరిశీలించామని, నరికేసిన వ్యక్తి శ్రీనివాస్ నోటీసులు ఇచ్చి, జరిమానా విధిస్తామని పై అధికారులకు కూడా చెబుతామని తెలిపారు. ఇది ఇలా ఉండగా పైప్ లైన్ ఉందని తొలగించామని, మళ్ళీ పక్కకు చెట్లు నాటిస్తామని ఏఎంసీ డైరెక్టర్ బాలు నమస్తే తెలంగాణ కు వివరించారు.

# ఐడియా అదుర్స్.. సందర్శకులను ఆకట్టుకుంటున్న పెద్దపల్లి మున్సిపాలిటీ



**పెద్దపల్లి,-నవభూమి:** పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ ఆధ్వర్యంలో వేస్ట్ మెటియల్ పాత టైర్లు, ప్లాస్టిక్ బాటిల్స్??తో అలంకరణ సామగ్రి తయారు చేస్తున్నారు. సందర్శకులను ఆకర్షించే విధంగా మున్సిపల్ కార్యాలయ మొదటి అంతస్తులో పాత టైర్లుతో కుర్చీలు, టీ పాయ్ ఏర్పాటు చేశారు. అలాగే మొక్కల రక్షణగా గార్డ్ ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ బాటిల్స్??కు రంగులు వేసి అందులో మట్టి పోసి అలంకరణ మొక్కలు పెంచుతున్నారు. గార్డెన్‌లో పువ్వులు, పండ్లు, టమాట, వంకాయ, క్యాబేజీ కురగాయల మొక్కలు పెంచతున్నారు. దీంతో సందర్శకులు ఫిదా అవుతున్నారు.



# చక చక సాగుతున్నలిఫ్ట్ ఏర్పాటు పనులు.. 'నమస్తేతెలంగాణ' కథనానికి స్పందన



**పెద్దపల్లి,-నవభూమి:** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో లిఫ్ట్ ఏర్పాటు పనులు చక చక సాగుతున్నాయి. పెద్దపల్లి మున్సిపల్ నూతన భవనాన్ని రూ. 6.5 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 3 అంతస్తులలో నిర్మించారు. కాగా గతేడాది డిసెంబర్ 4న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కానీ లిఫ్ట్ లేక వృద్దులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నరని మెట్లెక్కలేక ఇబ్బందులు%ొ%అనే శీర్షికతో ఈనెల 9న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. కాగా, మున్సిపల్ అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్‌తో లిఫ్ట్ ఏర్పాటు పనులు చక చక చేయిస్తున్నారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వారం రోజుల్లో లిఫ్ట్ ను అందుబాటులో తెస్తామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు.

# సేవకు దక్కిన గౌరవం.. దేవి రోహిత్‌కు స్ఫూర్తి పురస్కారం



**కోల్ సిటీ, -నవభూమి:** తండ్రి బాటలో తనయుడిగా అతి చిన్న వయసులోనే 14 సార్లు రక్తదానం చేసి నేటి యువతకు దేవి రోహిత్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తండ్రి బాటలో తనయుడిగా యుక్త వయసులో సమాజ హిత కార్యక్రమాలు చేపడుతూ తాను రక్తదానం చేస్తూ తోటి స్నేహితులతో కూడా ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నందుకు ప్రతిఫలంగా రోహిత్ సేవలకు గౌరవ దక్కింది. వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవాల సందర్భంగా జూన్ 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని దేవి రోహిత్ అందుకోనున్నారు. అతి చిన్న వయసులోనే 14 సార్లు రక్త దానం చేసి రక్తదానంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణదాతగా నిలుస్తున్నాడు. తనతో పాటు తన స్నేహితులను ప్రోత్సహిస్తూ తన కుటుంబ సభ్యులను కూడా రక్తదానం చేపిస్తూ ప్రజలలో అవగాహన కల్పిస్తూ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ గోదావరిఖని క్లబ్ ట్రైనర్ గా, వివిధ రకాల సమాజ సేవ, ఆధ్యాత్మికత కార్యక్రమాల్లో యోగ వాలంటీర్ గా పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న దేవిరోహిత్ ను వసుంధర విజ్ఞాన వికాస మండలి జ్యూరీ కమిటీ అభినందనలు తెలుపుతూ స్ఫూర్తి పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా రోహిత్ ను పలు స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు అభినందించారు. తన తండ్రి దేవి లక్ష్మీనరసయ్య వారసుడిగా ఆయన సేవా భావజాలంను పునికి పుచ్చుకొని అదే బాటలో నడుస్తుండడం అభినందనీయమని కొనియాడారు.

# 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు గురుకులానికి నజరానా

**సుల్తానాబాద్ -నవభూమి:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గరేపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం లో ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందుకు గాను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకుల విద్యాలయ అభివృద్ధి కోసం రూ.ఐదు లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 28న హైదరాబాదులోని ప్రజా భవన్ లో ప్రిన్సిపాల్ గిరిజను అభినందించి సన్మానించారు. గర్రెపల్లి గురుకుల విద్యార్థులు విద్యలో రాణించి మంచి ఫలితాలు సాధించినందుకు పలువురు ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపక సిబ్బందిని అభినందించారు.

